## క్లుప్తంగా

### టీడీపీ కార్యకర్తల అరెస్టు

పిఠాపురం: దౌర్జన్యాలకు పాల్పడిన గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలను ఆదివారం అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శనివారం జనసేన నేత, ఎమ్మెల్సీ నాగబాబు గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన నేత మొయిళ్ల నాగబాబు వాహనం వెళుతుండగా, టీడీపీ జెండాలు పట్టుకున్న కార్యకర్తలు అదే గ్రామానికి చెందిన సీరం అప్పారావు, శీరం రాము అలియాస్ రాంబాబు అడ్డగించారు. జై వర్మ అంటూ నినాదాలు చేస్తూ, అతనిపై దాడి చేశారు. ఈ క్రమంలో గొడవపడ్తున్న సీరం అప్పారావు, శీరం రాము, మరి కొంతమందిని అదుపు చేసేందుకు యత్నించిన పిఠాపురం అడిషనల్ ఎస్సై జాన్ బాషాను తోసివేసి, ఆయన విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు అడిషనల్ ఎస్సై జాన్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీరం అప్పారావు, శీరం రాముపై కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు.

### నేడు దరఖాస్తుల పరిశీలన

సామర్లకోట: సబ్సిడీపై వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందడానికి చేసిన దరఖాస్తులను సోమవారం పరిశీలన చేస్తారని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, ఈబీసీ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసుకున్న వారు సోమవారం స్థానిక టీటీడీసీలో జరిగే దరఖాస్తుల పరిశీలనకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తు, ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల నకళ్లను మూడు సెట్లుగా తీసుకు రావాలన్నారు. ఆయా సంస్థల, బ్యాంకు అధికారులు దరఖాస్తులను పరిశీలించి, అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు.

### అన్నదానానికి భక్తుల రద్దీ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

### సంప్రదాయంగా.. కాలుష్య రహితంగా..


అరిటాకులో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాలు

పిఠాపురం: పట్టణంలోని సీతయ్యగారితోట అయోధ్య రామయ్య ఆలయంలో న్యాయవాది సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరాముడి కల్యాణం సందర్భంగా సంప్రదాయబద్ధంగా, కాలుష్య రహితంగా విందు నిర్వహించారు. కల్యాణం సందర్భంగా నిర్వహించిన విందులో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు ఉపయోగించకుండా, కేవలం అరిటాకులు, స్టీలు గ్లాసులతో విందు నిర్వహించారు. కాలుష్యం పెంచుతున్న ప్లాస్టిక్‌ను పండగ నాడైనా పక్కన పెట్టి, అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇలా చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

### కరెంట్ స్తంభాలపై వైరు చోరీ


సామర్లకోట-పిఠాపురం రోడ్డులో విద్యుత్ స్తంభాలకు కట్ చేసిన వైర్లు

సామర్లకోట: పిఠాపురం రోడ్డులో ఉప్పువారి సత్రం సమీపంలో విద్యుత్ స్తంభాలకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఏర్పాటు చేసిన వైర్లను శనివారం రాత్రి దొంగలు అపహరించారు. సుమారు 20 స్తంభాలపై ఉన్న 5 లైన్ ఎల్‌టీ కండక్టరు వైరు ఎక్కడికక్కడే ముక్కలు చేసి తస్కరించినట్టు అధికారులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న పోలీసులు

సామర్లకోట: వాహనాలను మద్యం తాగి నడిపితే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. మద్యం మత్తులో ఉన్న వాహన చోదకులు అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి, అవగాహన కల్పించారు.


పిఠాపురం చిట్టోడితోటలో కల్యాణానికి మంగళ వాయిద్యాలతో వెళ్తున్న పెళ్లి పెద్దలు


గోర్స పురాతన రామాలయంలో కల్యాణ మహోత్సవం


మహారాణి సత్రంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఈఓ దంపతులు


చదలాడ రామాలయంలో ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు


వేట్లపాలెంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

# కమనీయం.. శ్రీరాముని కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన రామాలయాలు
- భారీగా అన్నదానం, పానకాలు, వడపప్పు పంపిణీ

పిఠాపురం: భద్రాద్రి రాముడు కల్యాణం పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలు, పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీలలో ఆదివారం కమనీయంగా జరిగింది. అన్ని రామాలయాల్లో వేదఘోష, రామనామం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు పానకాలు, విసినకర్రలు, వడపప్పు, పులిహోరాలు పంపిణీ చేశారు. పలుచోట్ల భారీ అన్న సమారాధనలు జరిగాయి. పలువురు ప్రజాప్రతినిధులు కల్యాణోత్సవాల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాలు కనుల పండువగా జరిగాయి. పిఠాపురం పట్టణంలో గాలింగాలమ్మ గుడి వీధిలో 250 ఏళ్ల చరిత్ర కలిగిన రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా బాలిపల్లి సూర్యనారాయణ, నాగమణి దంపతులు కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెడ్డెం తాతారావు, తలిశెట్టి వెంకటేశ్వరరావు, రెడ్డెం జనార్దన్, రెడ్డెం రమేష్, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని చిట్టోడితోట, సీతయ్యగారి తోట, రామాలయాల్లో రాముల వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు.


పిఠాపురంలో రాముల వారి కల్యాణం


పిఠాపురంలో విశేషాలంకారంలో రాముల వారు

**భక్తులతో ఆలయాల కిటకిట**

కొత్తపల్లి: మండలంలోని సీతారాముల ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గోర్సలోని పురాతన సీతారామస్వామి ఆలయంలో భద్రాద్రి రాముడు కల్యాణ మహోత్సవ ముహూర్తానికి వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల అనంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వాకతిప్పలో సాలివాసలో ఉన్న పద్మశాలి రామాలయంలో చేనేత కార్మికులు, జాంధానీ వస్త్ర దుకాణ వ్యాపారులు కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ముత్యాల తలంబ్రాలను వేశారు. ఉప్పాడ, కొమరగిరి, కుతుకుడుమిల్లి, రమణక్కపేట, శ్రీరాంపురం, మూలపేట, యండపల్లితో పాటు, అన్ని గ్రామాల్లోనూ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయాలను విద్యుద్దీపాలు, రంగులు, మామిడి తోరణాలతో అలంకరించారు.


వాకతిప్పలో ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

**ఘనంగా నవమి వేడుకలు**

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు రామాలయాల తరలివచ్చారు. స్థానిక మహారాణి సత్రంలో శ్రీరామ నవమి వేడుకలు సత్రం ఈఓ కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈఓ దంపతులు పీటలపై ఆశీనులై కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, తూతిక రాజు, బొడ్డు ఉదయ్‌శంకర్ తదితరులతో కలిసి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. స్థానిక గోలివారి వీధి రామాలయం వద్ద కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం పానకం, ప్రసాద వితరణ జరిగింది.


సామర్లకోట మఠం సెంటర్‌లో సీతారాముల కల్యాణం

**వాడవాడలా.. పండుగ వాతావరణం**

సామర్లకోట: సీతారాముల కల్యాణం వాడవాడలా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని రామాలయాల్లో ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు చేశారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు గుణ్ణం రాజబ్బాయి, యార్లగడ్డ చిన్ని తదితరులు ఉన్నారు. మఠంసెంటర్ లోని రామాలయంలోని కల్యాణాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టరు చందలాడ అనంత పద్మనాభం తిలకించారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులకు పానకం, ప్రసాద వితరణ చేశారు. నీలమ్మ చెరువు వద్ద ఎన్టీఆర్ ఎలిమెంటరీ పాఠశాల వద్ద, సత్యనారాయణపురంలోని రామాలయం వద్ద కల్యాణం ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణపురంలో 101 కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలోను సీతారాముల కల్యాణం నిర్వహించారు. గొంచాల గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన భద్రాది సీతారామాలయంలో కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయంలోని సీతారామ, లక్ష్మణ విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా గోదావరి కాలువ, చెరువులు, బావుల వద్దకు బ్యాండ్ మేళాలతో తీసుకెళ్లి, మంగళ స్నానాలు చేయించారు. ఆయా కల్యాణ ఉత్సవాల్లో కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# కళ్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం


గొల్లప్రోలులో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ సత్యనారాయణ

పిఠాపురం: ప్రచండ భానుడి ప్రతాపంతో మండిన ఎండ ఒక్కసారిగా మటుమాయమై అనుకోని అతిథిగా వచ్చిన అకాల వర్షం అన్నదాతను నిండా ముంచేసింది. ఒకవైపు ఎండలు మండుతూనే, క్షణాల వ్యవధిలో శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా భారీ వర్షం కురవడంతో, ధాన్యాన్ని జాగ్రత్త చేసుకునే వీలు లేకపోవడంతో.. కళ్లాల్లోనే ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో ఆదివారం రైతులు తమ కళ్లాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే సార్వా సీజన్‌లో ఏలేరు వరదల వల్ల తీవ్ర నష్టాలను చవిచూసిన కర్షకుడు రబీలో కొంత తేరుకుందామనుకుంటే, అకాల వర్షం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. యంత్రాలతో కోతలు పూర్తి చేయడం వల్ల తేమ శాతం తగ్గించడానికి ఎండలో ఆరబెట్టామని, కానీ అనుకోకుండా వచ్చిన వర్షం వల్ల ధాన్యం తడిసిపోవడంతో తీవ్ర నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా సుమారు 180 ఎకరాల్లో వరి పనలు సైతం తడిసి పోవడంతో రైతులు వాటిని ఆరబెట్టుకోడానికి శ్రమించాల్సి వచ్చింది. అకాల వర్షం వల్ల తీవ్ర నష్టం వచ్చి పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంత ఆరబెట్టినా, ఒకసారి తడిసిపోవడం వల్ల మొలకలు రావడం, రంగు మారడం వంటివి జరిగి ధాన్యం విలువ తగ్గి ధర లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే యంత్రాలతో కోయడం వల్ల ఇప్పటికే తేమతో ఉన్న ధాన్యం.. తడవడం వల్ల మరింత తేమ శాతం పెరిగి తీవ్ర నష్టం వచ్చే అవకాశాలున్నట్లు రైతులు చెబుతున్నారు.

**ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి**

అకాల వర్షానికి తడిసిన ధాన్యం పాడవకుండా ఉండడానికి ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ రైతులకు సూచించారు. ఆయన ఆదివారం గొల్లప్రోలు మండలంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాల వల్ల అక్కడక్కడా పంటలు నేల కొరిగాయన్నారు. కొన్ని చోట్ల ధాన్యం రాశులు తడిసినందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారని తెలిపారు. మండలంలో ఏడు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. రైతులు వాటిని ఉపయోగించుకుని ధాన్యాన్ని విక్రయించవచ్చని తెలిపారు.

# అర్ధరాత్రి సీతారాముల కల్యాణం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

**చేబ్రోలులో ఏళ్ల తరబడి ఆచారం**

పిఠాపురం: ఏటా శ్రీరామ నవమి రోజున వాడవాడలా జరిగే శ్రీసీతారాముల కల్యాణం అన్ని చోట్లా పగటి వేళ జరగడం ఆచారమైతే, ఒక్క గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మాత్రం అదే రోజు అర్ధరాత్రి జరుగుతుంది. ఈ ఆచారం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి సీతారాముల కల్యాణం వేద ఘోష నడుమ వేలాదిగా తరలి వచ్చిన భక్తజన సందోహం తిలకిస్తుండగా, వేద పండితులు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పిఠాపురం సంస్థానాధీశులు పూర్వం తమ సంస్థానం పరిధిలో శ్రీరామ నవమి నాడు అన్ని ఆలయాలకు వెళ్లి పూజలు చేసి, చివరకు రాత్రి సమయంలో ఇక్కడకు వచ్చి శ్రీరామ కల్యాణంలో పాల్గొనేవారు. దీంతో ఇక్కడ కల్యాణం రాత్రి సమయాల్లో జరుగుతోందని నానుడి. వందల ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతుండడంతో, దీనిని ఇప్పటికీ అమలు చేస్తున్నారు.


చేబ్రోలులో అర్ధరాత్రి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# స్వామి చెంత చేరిన శ్రీమహాలక్ష్మి

- నేటి నుంచి మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాలు
- 8న కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి
- 13న శ్రీపుష్పయాగోత్సవం

సామర్లకోట: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామి కల్యాణ ఉత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్రేతాయుగంలో దండకారణ్య ప్రాంతంగా పిలువబడే ఈ ప్రాంతంలో తపమాచరించిన మాండవ్య మహర్షి.. స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో మాండవ్య నారాయణ స్వామి అనే పేరు ప్రసిద్ధమైనట్టు చరిత్ర చెబుతోంది. విగ్రహ ప్రతిష్ఠ సమయంలో మహర్షి స్వామివారి పాదాల చెంత పరుసవేదిని ఉంచారని, ఈ విగ్రహాన్ని ఏ వస్తువైనా స్పృశిస్తే.. అది బంగారం అవుతుందనే ప్రచారం ఉంది. దాంతో ఓ వ్యాపారికి చెందిన 15 మంది అనుచరులు విగ్రహాన్ని తవ్వి పరుసవేదిని కాజేయబోగా, మహా సర్పం అక్కడ ప్రత్యక్షమై వారిని అడ్డుకున్నట్లు పురాణ కథల ద్వారా తెలుస్తుంది. మాండవ్య మహర్షి ప్రతిష్ఠించిన విగ్రహ ప్రదేశంలో విజయాదిత్యుడు దానిని నిర్మించినట్టు చెబుతున్నారు. సముద్రంలో లభించిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని జాలర్లు మహారాజుకు ఇవ్వగా, ఆయన స్వామివారి విగ్రహానికి పది అడుగుల దూరంలో భోగ మండపంలో లక్ష్మీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని చెబుతారు.

పంచారామ క్షేత్రమైన కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న ఈ ఆలయం దక్షిణ బదరీగా పేరు ఉంది. ప్రసిద్ధి చెందిన స్వామివారి కల్యాణం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. గోదావరి తుల్యభాగ నదీతీరాన వెలసిన స్వామి.. కోరికలను తీర్చే కొంగు బంగారంగా, భక్తుల పాలిట కల్పవల్లిగా ఈ దేవాలయం ప్రసిద్ధి గాంచింది. ప్రాచీన సంస్కృతీ వైభవానికి అద్దం పట్టే మాండవ్య నారాయణస్వామి ఆలయం పవిత్రతకు, ప్రశాంతతకు నిలయంగా పేరొందింది. ఈ ఆలయానికి చేరుకోవడానికి గోదావరి కాలువపై కాలిబాట వంతెనను నిర్మించారు.


సామర్లకోటలోని మాండవ్య నారాయణస్వామి ఆలయం


శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామి


ఆలయంలో వెలసిన లక్ష్మీదేవి


నిత్యం నిండుగా ఉండే బావి

**నేటి నుంచి కల్యాణ ఉత్సవాలు**

కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం బ్యాండు మేళాలతో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి తెలిపారు. మంగళవారం స్వామివారికి, అమ్మవార్లకు మంగళ స్నానాలు, పంచామృతాభిషేకం చేస్తారు. సాయంత్రం విశేష పూజలు, అంకురారోపణ, ధ్వజారోహణ, భక్త బృందంతో విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతాయి. రాత్రి స్వామివారి కల్యాణం, ఆలయ ప్రాంగణంలో భక్తులతో దీపారాధన ఉంటాయి. అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందని ఈఓ చౌదరి తెలిపారు. ప్రతి రోజు పూజలు, శుక్రవారం మధ్యాహ్నం స్వామివారి గ్రామోత్సవం ఉంటుంది. అదేవిధంగా 12వ తేదీన పూజలు, పూర్ణాహుతి ఉంటాయి. 13న ధ్వజావరోహణ, మాండవ్య నారాయణస్వామి భజన మండలితో పురందరదాసు కీర్తనలు ఆలపిస్తారు. అదే రోజు రాత్రికి స్వామివారి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వెంకట్రాయ చౌదరి వివరించారు.

**దోషాలు తొలగుతాయి**



శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణ స్వామి కల్యాణం ఏటా చైత్ర మాసం శుద్ధ ఏకాదశి పర్వదినంలో జరుగుతుంది. సీతారాముల కల్యాణం జరిగిన రెండు రోజుల తరువాత స్వామి కల్యాణం ఉంటుంది. ఈ కల్యాణం తిలకిస్తే అవివాహితులకు పెళ్లి కావడంతో పాటు, సంతాన భాగ్యం, సుఖసంతోషాలు కలుగుతాయి. ఆలయం ప్రశాంతతకు మారు పేరు. అనేక మంది విద్యార్థులు ఆలయ ప్రాంగణంలో చదువుకుంటుంటారు. ఆలయ బావిలోని నీరు కొబ్బరినీళ్లను మరిపిస్తుంది.

– చక్రవర్తుల రఘురామ్ ఆచార్యులు, ప్రధానార్చకుడు, సామర్లకోట

### కాండ్రకోట నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం: మండలంలోని కాండ్రకోటలో ఉన్న నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి తొలి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమవాస్య మాసాన్ని పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు జాతర మహోత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ ఈఓ ఆర్.సౌజన్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. సీఐ విజయ్‌శంకర్ పర్యవేక్షణలో ఎస్సై మౌనిక బందోబస్తు కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

### వసంత నవరాత్ర పూజలు నేటితో ముగింపు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్ర ఉత్సవాలు సోమవారంతో ముగుస్తాయి. దీనిలో భాగంగా ఆదివారం ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి నవవరణార్చన త్రిశతి ఖడ్గమాల, లలితా అష్టోత్తర సహస్రనామాలు, కుంకుమార్చనలు, నీరాజన మంత్ర పుష్పాల కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ పండితులు అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, వేమూరి చంటి, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వెండి ఆభరణాలతో అలంకరించగా, అమ్మవారికి బంగారు కిరీటం, ఆభరణాలతో అలంకరణ చేశారు.